క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్ రేణుకను అభినందిస్తున్న సిబ్బంది

పాలకొండ: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.రేణుక ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి రాగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆమెను కలిసి, అభినందనలు తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



నేరడి-బి వీధిలో పోలీసుల కవాతు ప్రదర్శన

భామిని: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ప్రజలను కోరారు. అలాగే ఓటర్లు స్వేచ్ఛగా తమకు నచ్చిన పార్టీకి ఓటు వేసి, ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలన్నారు.

దుర్గమ్మకు సంబర నీరాజనం



ఘటాలతో దుర్గమ్మ సన్నిధికి చేరుకున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు ఆదివారం సంబరాలు చేశారు. పట్టణ వాసులతో పాటు పట్టణ పరిసర గ్రామాల భక్తులు పెద్దఎత్తున మండల కేంద్రంలోని ఆలయానికి చేరుకుని, అమ్మవారికి ఘటాలు, ముర్రాటలు సమర్పించారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన ఆలయానికి భక్తులు చేరుకుని మరీ మొక్కులు చెల్లించుకోవడం విశేషం. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డప్పు వాయిద్యాల ప్రదర్శనలు, అమ్మవార్ల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

4 నుంచి ఆలయ వార్షికోత్సవాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఉమా సహిత కై లాసనాథ ఆలయం 41వ వార్షిక మహోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వార్షిక మహోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆలయం వద్ద ఆదివారం విడుదల చేశారు. మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద ప్రతీ రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయ పరిసరాల్లో వినోదం కోసం జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, బ్రేక్ డాన్స్, బైక్ రైడింగ్, వంటివి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతిరోజు రాత్రి 11 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వర్తక సంఘం అధ్యక్షుడు విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

22న ఉచిత మెగా వైద్య శిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో ఈనెల 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రామ మందిర కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని పెద్దవీధిలో సీతారామ మందిర పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డా.గుల్ల సూర్యప్రకాష్, డా.రామ్మోహన రావుతో పాటు పలువురు వైద్యులు శిబిరంలో పాల్గొని సేవలందిస్తారని తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదు కేంద్రాల్లో పది పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఐదు కేంద్రాల్లో నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలల నుంచి 780 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాల కేంద్రంలో 160 మంది, భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల కేంద్రంలో 170 మంది, టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 161 మంది, రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 144 మంది, గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 145 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి.



బియ్యాలవలసలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



బియ్యాలవలస సచివాలయం



బియ్యాలవలసలో నిర్మాణంలో ఉన్న హెల్త్‌వెల్‌నెస్ సెంటర్



గుమ్మిడిగూడలో నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన ప్రాథమికోన్నత పాఠశాల

గిరిజన గూడల్లో అభివృద్ధి అడుగులు

- బియ్యాలవలస, గుమ్మిడిగూడ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన
- సుమారు రూ.17.56 కోట్లతో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

కురుపాం: టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గుమ్మిడిగూడ, బియ్యాలవలస పంచాయతీలు నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. బియ్యాలవలస పంచాయతీ పరిధిలో బియ్యాలవలస, దురుబిలి, గొందిలోవ, పెళ్లివలస, మంత్రజోల, మత్రిగూడ, సూర్యనగరం, రంగుపురం, షేకుపాడు, దిమిటిగూడ గ్రామాలు, గుమ్మిడిగూడ పంచాయతీ పరిధిలో దండుసూర, గుజ్జులగండ, సంగెడ్డ, సింగుపురం, గుజ్జుపాడు, గోళ్లవలస గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసింది. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ఐదేళ్లలో ఈ



షేకుపాడు గ్రామానికి నిర్మించిన బీటీ రహదారి

రెండు పంచాయతీల పరిధిలో సుమారు 6,363 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.17.56 కోట్లు లబ్ధి జరిగింది. అలాగే రూ.2.13 కోట్లతో ప్రభుత్వ భవనాలు, రోడ్లు, కాలువలు నిర్మించారు.

సంక్షేమ లబ్ధి వివరాలు..

- ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) ద్వారా 4,549 మందికి రూ.13,34,60,123 లబ్ధి చేకూరగా.. పరోక్ష ప్రయోజనాలు(నాన్ డీబీటీ) ద్వారా 1814 మందికి రూ.4,21,74,964లు లబ్ధిపొందారు.
- గుమ్మిడిగూడ, బియ్యాలవలస పంచాయతీలో పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా 6,363 మందికి రూ.17,56,35,870లు అందజేశారు.

గతంలో అభివృద్ధికి ఆమడదూరం



గత టీడీపీ పాలనలో పంచాయతీ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయం పరిధిలో రహదార్లు, సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, నాడు-నేడు ద్వారా పాఠశాల సుందరీకరణ పనులు చేపట్టారు. అభివృద్ధికి ఆదర్శంగా బియ్యాలవలస, గుమ్మిడిగూడ పంచాయతీలు నిలుస్తున్నాయి.

– శెట్టి సురేష్, సర్పంచ్, గుమ్మిడిగూడ పంచాయతీ

అభివృద్ధి పనుల వివరాలు..

- బియ్యాలవలస పంచాయతీలోని షేకుపాడు గ్రామానికి రూ.47 లక్షలతో 750 మీటర్ల బీటీ రహదారి నిర్మాణం.
- పెళ్లివలస గ్రామానికి రూ.15 లక్షలతో 450 మీటర్ల బీటీ రహదారి నిర్మాణం.
- బియ్యాలవలస పంచాయతీ కేంద్రంలో రూ.42 లక్షలతో గ్రామసచివాలయం నిర్మాణం.
- రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం.
- గుమ్మిడిగూడలో రూ.24 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాల ఆధునికీకరణ.
- గుమ్మిడిగూడ పంచాయతీ సింగుపురం గ్రామానికి రూ.70 లక్షలతో బీటీ రహదారి నిర్మాణం పనులకు శంకుస్థాపన.
- రూ.20.80 లక్షలతో హెల్త్‌వెల్‌నెస్ కేంద్రం నిర్మాణ పనులు.
- గడపగడపకు కార్యక్రమం కింద కేటాయించిన నిధులు రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

రహదారి నిర్మాణంతో తీరిన కష్టాలు



దశాబ్దాలుగా అధ్వాన రహదారితో అవస్థలు పడ్డాం. అత్యవసర సమయంలో వైద్యం అందే పరిస్థితి నాడు లేదు. నేడు స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి చొరవతో మా షేకుపాడు గ్రామానికి రహదారి నిర్మించారు. ఎంతో సంతోషంగా ఉంది.

– తోయక నాగేశ్వరరావు, షేకుపాడు గ్రామం, బియ్యాలవలస పంచాయతీ



పెళ్లివలస గ్రామానికి నిర్మించిన బీటీ రహదారి

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్



కురుపాంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేటలో వాల్‌పోస్టర్‌ను తొలగిస్తున్న ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్



గరుగుబిల్లి: కొత్తపల్లిలోని ప్రధాన వీధిలో దర్శనమిస్తున్న బ్యానర్లు, జెండాలు

కురుపాం, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కురుపాం నియోజకవర్గ కేంద్రంలో రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తన నిబంధనలపై పార్టీల నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, విశ్రాంతి భవనాలు, విద్యుత్ స్తంభాలపై ఉన్న వివిధ పార్టీలకు చెందిన పోస్టర్లను, ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ ఆధ్వర్యంలో వీర్వోలు, సచివాలయం ఉద్యోగులు ఆదివారం గ్రామాల్లో పర్యటించి వాల్‌పోస్టర్లను తొలగించారు. ఇంకా పలు గ్రామాల్లో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, పోస్టర్లు దర్శనమిస్తున్నాయి.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించడమే లక్ష్యం

- పాలకొండ డీఎస్పీ కృష్ణారావు



డీఎస్పీ కృష్ణారావు

వీరఘట్టం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించడమే తమ లక్ష్యమని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన ఆదివారం సాక్షి విలేకరులతో ముచ్చటించారు. పోలింగ్ సమయంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను ఇప్పటికే గుర్తించి, నిఘా ఉంచామన్నారు. ఎవరైనా అలజడులు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు కూడా ఎన్నికల ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. పాలకొండ డివిజన్ పరిధిలో కురుపాం, పాలకొండ నియోజకవర్గాలు ఉండగా, పాలకొండ నియోజకవర్గంలోని 1,93,667 మంది ఓటర్లు.. 287 పోలింగ్ కేంద్రాల్లో, కురుపాం నియోజకవర్గంలోని 1,92,636 మంది ఓటర్లు.. 208 పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయనున్నారన్నారు. ఆయా నియోజకవర్గాల్లో మొత్తం 31 సమస్యాత్మక, 12 అతి సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయన్నారు. ఎన్నికల వేళ గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు బైండోవర్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతోందన్నారు. చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేసి, డబ్బు, మద్యం రవాణా జరగకుండా చూస్తున్నామన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- పరీక్ష కేంద్రాలను సందర్శించిన అధికారులు
- మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని సూచన

సీతంపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని మల్లి, సీతంపేట, దోనుబాయి, చిన్నబగ్గ, హడ్డుబంగి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఐటీడీఏ డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి ఆదివారం పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నవీ లేనివీ ఆమె గమనించారు. 18 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల నుంచి మొత్తం 990 మంది పరీక్షలకు హాజరు కానున్నారని, వీరిలో 525 మంది బాలికలు, 465 మంది బాలురు ఉన్నారన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంప్, ఫ్యాన్లు, ఫర్నిచర్ ఉండేలా చూడాలని సిబ్బందికి ఆమె సూచించారు.

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, వివేకానంద, తమ్మినాయుడు, సత్యసాయి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో 786 మంది రెగ్యులర్ విద్యార్థులు, గతంలో పరీక్ష తప్పి, ఇప్పుడు మళ్లీ పరీక్షలు రాస్తున్న 84 మందితో కలిపి మొత్తం 870 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చగా, విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ప్రశ్నపత్రాలు చేరినట్లు ఎస్.కె.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



సీతంపేట: మల్లి గిరిజన గురుకులంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో లిల్లీరాణి

పక్కాగా ఎన్నికల కోడ్ అమలుచేయాలి



పాలకొండ పట్టణ ప్రధాన రోడ్డులో పర్యటిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాలకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక పట్టణంలో ఆదివారం సాయంత్రం పర్యటించిన ఆయన ఎన్నికల కోడ్ అమలుతున్నదీ లేనిదీ పరిశీలించారు. వీరఘట్టం సెంటర్ నుంచి శ్రీకాకుళం రోడ్డులోని ఆర్‌డీవో కార్యాలయం వరకు కాలినడకన వెళ్లిన ఆయన రోడ్డుకు ఇరువైపులా రాజకీయ బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులు చూసి, అధికారులకు పలు సూచనలు చేశారు. కోడ్ అమలుపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆర్‌డీవో వెంకటరమణకు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు చెప్పారు.

పాలకొండ: ఎన్నికల నియమావళి అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక పట్టణంలోని పలు వీధుల్లో ఉన్న రాజకీయ హోర్డింగులు, ప్రచార బోర్డులను ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఎక్కడా పార్టీ ప్రచార బ్యానర్లు, హోర్డింగులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో వాటిని తొలగించడం జరుగుతోందన్నారు. తమ అనుమతులు లేకుండా ఎక్కడా ఎటువంటి బోర్డులు ఏర్పాటు చేయకూడదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలని సూచించారు.

భామిని: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండల వ్యాప్తంగా రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఆదివారం తొలగించారు. నేరడి-బి సచివాలయం పరిధిలో కార్యదర్శి లోవ అనసూయ ఆధ్వర్యంలో రాజకీయ పోస్టర్లు, స్టిక్కర్లు తొలగించారు. కొన్ని జంక్షన్లు, ప్రధాన కూడళ్లలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు కూడా వేశారు.

కురుపాం: ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమ లు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లను, పోస్టర్లు, కటౌట్లను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.వెంకటరమణతో కలిసి కురుపాంలో ఆదివారం కలెక్టర్ పర్యటించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ కోడ్ పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సి-విజిల్‌లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అందే ఫిర్యాదులపై అదే రోజు, మీడియాలో ప్రచురితమయ్యే ఫిర్యాదులు, ఇతర ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమలులో అలసత్వం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటు..

సాధారణ ఎన్నికల దృష్ట్యా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08963-796126, 08963-293046, ఎస్పీ కార్యాలయంలో 8977519101 నంబరుకు ప్రజలు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం అందించవచ్చన్నారు.

ఘనంగా సిరుల యాత్ర

వీరఘట్టం: మండల కేంద్రంలోని సాయినగర్ సమీపంలో సిరుల ఎల్లమ్మ యాత్ర ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్. శర్మయాజి ఆధ్వర్యంలో అక్కడి శిర్లు పోతన్న, ఎల్లమ్మలకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు జరగనున్న ఈ యాత్ర మూడో రోజుకు భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

భామిని: మండలంలోని నేరడి-బి గ్రామంలో సిరులు ఎల్లమ్మ యాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారికి జోగి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అటు ఆంధ్రా ఇటు ఒడిశా ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి పోటీపడడం విశేషం. అంతకుముందు ఎల్లమ్మను గ్రామంలో ఊరేగించి, భక్తులు తీసుకువచ్చిన ముర్రాటలతో చల్లదనం చేశారు. ం

పాలకొండ రూరల్: భక్తుల పాలిట కల్పవల్లి సిరులు ఎల్లమ్మ యాత్రకు ఆదివారం భక్తులు పోటెత్తారు. స్థానిక పట్టణంలోని శిర్లి పోతన్న వీధిలో జరిగే ఈ యాత్రకు పట్టణ వాసులతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. తాము నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించమని వేడుకున్నారు. ఇదిలా ఉండగా, పాలజంగిడి, సింధూర కుండ దర్శనానికి భక్తులు ఎగబడ్డారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. భక్తులకు తాగునీరు, మజ్జిగను సత్యసాయి సేవా సమితి సభ్యులు అందించారు. యాత్ర సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



దైవ దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



పాలకొండ రూరల్: ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులు



భామిని: ఎల్లమ్మ విగ్రహ ఊరేగింపు

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మక్కువ: మండలంలోని కొండరేజేరు గ్రామంలో అంజనేయ స్వామికి వైఎస్సార్‌సీపీ మండ ల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆదివా రం ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభ కార్యక్రమాన్ని మూడు రోజులుగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆదివారం ముగియడంతో, రంగునాయుడు పాల్గొని, స్వామి వారికి అభిషేకాలు చేశారు. గ్రామంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పాపయ్యవల స, కాశీపట్నం, గ్రామాలనుంచి భక్తులు చేరుకు ని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న రంగునాయుడు

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు

సీతంపేట: క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా మండల వ్యాప్తంగా పాడైన బోర్లను యుద్ధప్రాతిపదికన బాగుచేసి, వినియోగంలోకి తీసుకువస్తున్నారు. దోనుబాయి, గుజ్జి తదితర మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మంచినీటి కొరత తీర్చే పనిలో సంబంధిత సిబ్బంది నిమగ్నమయ్యారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నామని మెకానిక్‌లు శంకరరావు, ప్రసాద్, భాస్కరరావు, భూషణ్, మౌళి తెలిపారు. నాలుగు రోజుల్లో 60 బోర్లు, పలు పైపులైన్ల మరమ్మతులు చేపట్టామన్నారు.



గుజ్జి గ్రామంలో తాగునీటి బోరు బాగుచేస్తున్న మెకానిక్‌లు